క్లుప్తంగా

ఆకట్టుకున్న అష్టపదుల ఆలాపన



అష్టపదులు ఆలపిస్తున్న మండపాక శారద

సీతంపేట: డాక్టర్ మండపాక శారద ఆలపించిన అష్టపదులు సంగీత విద్యార్థులు, ఔత్సాహికులను ఆకట్టుకున్నాయి. విమలకృష్ణ మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఏయూ సంగీత విభాగం విశ్రాంత ఆచార్యురాలు డాక్టర్ మండపాక శారద ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో రెండు రోజుల ఉచిత సంగీత శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పలు అష్టపదులను శ్రావ్యంగా ఆలపించారు. భారతీయ సంగీత చరిత్రలో ప్రప్రథమ వాగ్గేయకారునిగా గ్రంథాల్లో పేర్కొన్న గీత గోవింద కార్యకర్త జయదేవుడు రచనలు అష్టపదులపై అవగాహన కల్పించారు. రాధాకృష్ణుల గాథలు మధురభక్తి భావంతో సాగే ఈ రచనలు నృత్య ప్రదర్శనలతోపాటు సంగీత కచేరీల్లో విస్తృతంగా తీసుకెళ్లేందుకు ఉచిత సంగీత శిక్షణ దోహదపడుతుందని డాక్టర్ శారద అన్నారు.

అవినీతి నిర్మూలనే లక్ష్యం



మాట్లాడుతున్న ఆచార్య నాగేశ్వరరావు

అల్లిపురం: దేశాన్ని అవినీతి పాలకుల నుంచి కాపాడటమే లక్ష్యంగా నేషనల్ స్కాలర్ పార్టీని ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆచార్య నాగేశ్వరరావు తెలిపారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ పార్టీ గుర్తుగల నవరంగ్ కాంగ్రెస్ పార్టీతో పొత్తుపెట్టుకుని రాబోయే ఎలక్షన్లలో తమ సత్తా చాటుతామన్నారు. తమ పార్టీలో విద్యావంతులు, ఉద్యమకారులు, మేధావులు ఎక్కువగా ఉంటారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో తమ పార్టీ విజయానికి అందరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్లకోమాపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి సిబ్బంది

బీచ్ రోడ్డు: ప్రపంచ గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఎల్‌వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ ర్యాలీలో గ్లకోమా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. గ్లకోమా అనేది కంటి ఒత్తిడి సంబంధిత దృష్టి లోపం కలిగించే వ్యాధి అని, ఇదీ కొన్ని రకాల స్టెరాయిడ్స్ వాడకం వల్ల వస్తుందని వైద్యులు తెలిపారు. ఈ వారోత్సవాలను స్టెరాయిడ్ ప్రేరిత గ్లకోమా అనే అంశంతో చేపట్టారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది : సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలు వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

కేజీహెచ్ రహదారులకు మహర్దశ

- ఆస్పత్రి ప్రాంతంలో కొత్త రోడ్ల నిర్మాణం
- శిథిల రహదారులకు మరమ్మతులు
- అన్ని చోట్ల స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు





కింగ్ జార్జి హాస్పిటల్(కేజీహెచ్)



ఏఎంసీ మహిళా హాస్టల్ నుంచి మార్చురీ వరకు కొత్తగా నిర్మించిన రహదారి

మహారాణిపేట: కింగ్ జార్జ్ హాస్పిటల్(కేజీహెచ్)లోని రహదారులకు మహర్దశ పట్టింది. గత ప్రభుత్వ హయాంలో ఆస్పత్రి ఆవరణలోని రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. అనేక ప్రాంతాల్లో రోడ్లు శిథిలమవడంతో రోగులు, వారి సహాయకులు ఇబ్బందులు పడేవారు. వివిధ రోగాలతో సతమతమవుతున్న రోగులు ఈ గతుకుల రోడ్లతో ఇక్కట్లకు గురయ్యేవారు. గత ప్రభుత్వ హయాంలో కేజీహెచ్‌లో ఎక్కడా కొత్త రోడ్లు గానీ, మరమ్మతులు గాని చేపట్టిన దాఖలాలు లేవు.



మెడికల్ కాలేజీ, సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌కు వెళ్లే దారిలో నిర్మించిన రోడ్లు



కార్డియాలజీ విభాగం నుంచి గైనిక్ విభాగం వరకు వేసిన రహదారి

కలెక్టర్ మంజూరు చేసిన నిధులతో..

ఇక్కడి రహదారుల పరిస్థితిని తెలుసుకున్న కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆస్పత్రి అభివృద్ధి కమిటీ నిధుల నుంచి రూ.27 లక్షల మంజూరు చేశారు. ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.ఎ.నాయుడు ఆధ్వర్యంలో డీఈఈ మన్మధరావు రోడ్ల నిర్మాణం చేపట్టారు. కొన్ని ప్రాంతాల్లో రహదారులకు తక్షణ మరమ్మతులు చేపట్టారు. మరికొన్ని ప్రాంతాల్లో కొత్తగా రోడ్లు వేశారు. నర్సింగ్ కాలేజీ ఏరియాలో యుద్ధప్రాతిపదికన రహదారులు నిర్మించారు. దాదాపు ఒక కిలో మీటర్ వరకు రోడ్లు వేశారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ మహిళా హాస్టల్ నుంచి మార్చురీ వరకు, కార్డియాలజీ విభాగం నుంచి గైనిక్ విభాగం వరకు కొత్త రహదారులను నిర్మించారు. అన్ని ప్రాంతాల్లోని రోడ్లలో వేగం నియంత్రణ కోసం స్పీడ్ బ్రాకర్లు ఏర్పాటు చేసి రంగులు వేశారు. ఇప్పుడు కేజీహెచ్ ప్రాంతంలో రోడ్లు బాగుండటంతో ద్విచక్ర వాహన చోదకులు, పాదచారులు హాయిగా రాకపోకలు సాగిస్తున్నారు.



ఏఎంసీ మహిళా హాస్టల్ రోడ్డులో రంగులతో స్పీడ్ బ్యాకర్లు

శరవేగంగా పూర్తి



కేజీహెచ్‌లో అవసరమైన రోడ్ల నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేశాం. ఆస్పత్రి ఆవరణలోని పలు ప్రాంతాల్లో పాడైపోయిన రోడ్లను బాగుచేసి మరమ్మతు పనులు నిర్వహించాం. కొత్త రోడ్లను పూర్తిగా అందుబాటులో తెచ్చాం. రోగుల సౌకర్యాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది.

– మన్మధరావు, డీఈఈ, కేజీహెచ్ యూనిట్

సావిత్రిబాయి పూలేకు నివాళి



సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

డాబాగార్డెన్స్: భారతదేశ తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే వర్ధంతిని ఆదివారం నగరంలోని జిల్లా కోర్టు ఎదురుగా గల న్యాయవాది గుడిపల్లి సుబ్బారావు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పలువురు న్యాయవాదులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది గుడిపల్లి సుబ్బారావు మాట్లాడుతూ సమాజంలో వేధింపులు, అసమానతలు, వివక్షను ఎదుర్కొంటున్న మహిళలు మంచి స్థానంలో ఉండాలన్న ఉద్దేశంతో వారికి సావిత్రి బాయి విద్య నేర్పించారన్నారు. సమావేశంలో ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు బైపా అరుణ్‌కుమార్, బార్ అసోసియేషన్ సెక్రటరీ ఫైలా శ్రీనివాస్, కార్పొరేటర్, న్యాయవాది శశికళ, సుమన్, రాజారావు, సమ్మి సన్నియాదవ్, ఐఎం అహ్మద్, టీవీ రమణ, ఈశ్వర్రావు, నాగేశ్వరరావు, గీతా, రాణి పాల్గొన్నారు.

లలితా పీఠంలో హోమం

సీతంపేట: మాఘ అమావాస్య సందర్భంగా అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠంలో ఆదివారం వేద పండితులు ప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో హోమం ఆచరించారు. హోమం చేయడం వల్ల చెడు ప్రభావాలు నశిస్తాయని పీఠం మేనేజర్ కృష్ణసేన్ తెలిపారు.

పోలమాంబ జాతర మహోత్సవాలు ప్రారంభం



అలంకరణలో పోలమాంబ

డాబాగార్డెన్స్: పాతనగరం మంథావారి వీధి(రజక వీధి)లో వెలసిన పోలమాంబ జాతర(33వ పరస) మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి ప్రారంభ పూజలు, మంగళస్నానం చేశారు. మహిళలు పెద్ద ఎత్తున కలశాలతో పసుపు కుంకుమ నీళ్లతో అమ్మవారికి జలాభిషేకం చేశారు. సాయంత్రం 6 గంటల నుంచి భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు ఆటల పోటీలు ఏర్పాటు చేశారు. సోమవారం తొలేళ్ల ఉత్సవం నిర్వహించనున్నారు. ఉదయం 6 గంటలకు ప్రత్యేక పూజలు, 7 గంటలకు పంచామృతాభిషేకాలు, సహస్ర అర్చనలు, జోగి కార్యక్రమం, సాయంత్రం 5 గంటలకు అమ్మవారి సారె ఊరేగింపు, ఉయ్యాల కార్యక్రయాలు జరగనున్నాయి.

12న ప్రధాన పండగ

ఈ నెల 12న అమ్మవారి ప్రధాన పండగ, జాతర ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు ఉమామహేశ్వర ఆలయం, పోలమాంబ అమ్మవారి సేవా సంఘం అధ్యక్షుడు దమరశింగు కనకారావు, కార్యదర్శి గుడివాడ శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కరగాని శంకరరావు, ఉపాధ్యక్షులు బొండాడ లక్ష్మీప్రసాద్, కోట్ల సాయిబాబా, కోశాధికారి పండా సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఉదయం 7 గంటలకు కుంకుమ పూజలు, పుష్పాలంకరణ, సాయంత్రం అగ్నిగుండం, పులివేశాలు, తప్పెటగుళ్ల, తాడేపల్లిగూడెంచే కాళికశక్తి ట్రూప్ తదితర కార్యక్రమాలతోపాటు రోషన్‌లాల్ ఆర్కెస్ట్రా ఏర్పాటు చేసినట్టు సంఘ సభ్యులు చెప్పారు. 17వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్నసమారాధన జరుగుతుందన్నారు.



ఆటల పోటీల్లో పాల్గొన్న పిల్లలు

గ్రంథాలయ కొత్త కార్యవర్గం



ప్రమాణం చేస్తున్న వెంకట గౌరీశంకర గ్రంథాలయ కొత్త కార్యవర్గ సభ్యులు

అల్లిపురం: వెంకటేశ్వరమెట్ట శ్రీ వెంకట గౌరీశంకర గ్రంథాలయ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రంథాలయ అధ్యక్షుడిగా పాలమరశెట్టి శ్యామ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా బుద్ధ గోపాలకృష్ణ(గోపి), జాయింట్ వైస్ ప్రెసిడెంట్‌గా శరగడం భాస్కరరావు, కార్యదర్శిగా పాలమరశెట్టి శ్రీను, జాయింట్ సెంక్రటరీ రాపేటీ బాబాజీ, జాయింట్ సెక్రటరీగా రాపేటి శేఖర్, క్యాషియర్‌గా సూరిశెట్టి నరసింగరావు(వేలు), జాయింట్ క్యాషియర్‌గా నారిండ్ల కృష్ణ పాపారావులను ఎన్నుకున్నారు. కొత్త కార్యవర్గ సభ్యులు ఆదివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యవర్గం 2024–2026 వరకు కొనసాగుతుందని అధ్యక్షుడు శ్యామ్‌కుమార్ తెలిపారు.

30 మంది రక్తదానం



రక్తదాతలకు జ్ఞాపికలు అందజేస్తున్న చర్చి పాస్టర్ విన్సెంట్ రాజుకుమార్

డాబాగార్డెన్స్: వన్ టౌన్ మెయిన్ రోడ్డులో గల లండన్ మిషన్ మెమోరియల్ చర్చిలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించామని చర్చి పాస్టర్ రెమె.విన్సెంట్ రాజ్‌కుమార్ తెలిపారు. ప్రతి ఏడాది మార్చిలో యేసు క్రీస్తును స్మరించుకుంటూ రక్తదాన శిబిరం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఇందులో భాగంగా విశాఖ బ్లడ్‌బ్యాంకు సహకారంతో శిబిరం నిర్వహించామన్నారు. 30 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి బి.ఎ.ఎస్.రాజామణి, కోశాధికారి డానియల్ సుందర్ తిరుమన్, కార్యదర్శి హెన్రీ, అడ్వార్డ్ మెజేస్, సదానంద్ మోసెస్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెల్లువెత్తిన అభిమానం



లక్ష్మీటాకీస్ వద్ద 'సిద్ధం' కార్యక్రమాన్ని వీక్షిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు



వెంకటేశ్వరమెట్టపై లైవ్‌లో సభను తిలకిస్తున్న స్థానికులు



జోష్‌లో డ్యాన్స్‌లు చేస్తున్న అభిమానులు, కార్యకర్తలు

డాబాగార్డెన్స్: రాబోవు సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఆదివారం అద్దంకిలో నిర్వహించిన సిద్ధం సభ కార్యక్రమాన్ని వీక్షించేందుకు అభిమానులు వెల్లువెత్తారు. జీవీఎంసీ 39వ వార్డులో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షురాలు కొల్లి సింహాచలం ఏర్పాటు చేసిన లైవ్ స్క్రీన్‌లో కార్యక్రమాన్ని వీక్షించి పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున తన అభిమానం చాటుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ప్రసంగం కన్నా ముందు పార్టీ నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేల ప్రసంగాన్ని వీక్షిస్తూ కేరింతలు కొట్టారు. అనంతరం సీఎం జగన్ ప్రసంగమంతా వీక్షిస్తూ సిద్ధంకు మేమూ సిద్ధమేనంటూ జేజేలు పలికారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, అభిమానులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

నాయకులు, కార్యకర్తల్లో 'సిద్ధం' జోష్

వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల్లో సిద్ధం–4 సభ జోష్ నింపింది. అద్దంకి వేదికగా లక్షలాది మంది వైఎస్సార్‌సీపీ అభిమానుల మధ్య ఆదివారం నిర్వహించిన సిద్ధం సభను లైవ్ స్క్రీన్(ఎల్‌ఈడీ) ద్వారా వీక్షిస్తూ నృత్యాలు చేశారు. 31వ వార్డు డాబాగార్డెన్స్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్, రామానంద్ ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ తెరపై సిద్ధం సభ లైవ్‌ను నాయకులు.. అభిమానులు వీక్షిస్తూ కేరింతలు కొట్టారు. లైవ్‌లో «గిరా గిరా తిరుగుతున్న ఫ్యాన్» అంటూ పాటను వీక్షిస్తూ పార్టీ జెండా, ఫ్యాన్ చేత పట్టుకుని డ్యాన్స్‌లు వేశారు. ఈ సందర్భంగా బాపూ ఆనంద్ మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి అద్దంకి సభే నిదర్శనమన్నారు. ప్రతి ఒక్క కుటుంబానికీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు ఏదో రూపంలో అందుతూనే ఉన్నాయన్నారు. అద్దంకి సభను చూసిన ప్రతిపక్షాల ఒంట్లో వణుకు పుడుతుందన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

'సిద్ధం' సభ లైవ్ వీక్షణ

అల్లిపురం: బాపట్ల అద్దంకిలో నిర్వహించిన సిద్ధం సభ లైవ్‌ను తిలకించేందుకు వెంకటేశ్వరమెట్టపై వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠం ఆధ్వర్యంలో ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో వీక్షించే సీఎం వైఎస్ జగన్‌కు జేజేలు పలికారు.



31వ వార్డులో సిద్ధం కార్యక్రమాన్ని వీక్షిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు

ముగిసిన మాఘ మాసోత్సవాలు

సూర్యనారాయణమూర్తి విశేష పూజలు



సూర్యనారాయణ స్వామి మూలవిరాట్టు పాదాలను తాకిన సూర్యకిరణాలు

అల్లిపురం: వెంకటేశ్వరమెట్టపై అలిమేలు మంగమ్మ ఆలయంలో వెలసిన సూర్యనారాయణమూర్తి దేవాలయంలో ఆఖరి ఆదివారంతో మాఘ మాసోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి పంచామృతాభిషేకాలు చేశారు. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆదివారం ఉదయం ఆలయ మూలవిరాట్టు సూర్యనారాయణస్వామి విగ్రహానికి సూర్యకిరణాలు తాకాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు పాణంగిపల్లి కేశవాచార్యులు స్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల లోగా సూర్య కిరణాలు మూలవిరాట్టును తాకాయన్నారు. ఏటా మూడు రోజుల పాటు సూర్యకిరణాలు తాకుతాయని తెలిపారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

సీసీ కెమెరాలతో ఇంటికి భద్రత

సీతమ్మధార: అపార్ట్‌మెంట్స్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, తద్వారా మరింత భద్రత ఏర్పడుతుందని క్రైం డీసీపీ వెంకటరత్నం సూచించారు. ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలోని నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో ఆదివారం దొంగతనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అపార్ట్‌మెంట్ వాసులకు దొంగతనాల కట్టడిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని, అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు కాల్ చేసి తెలియజేయాలన్నారు. అపార్ట్‌మెంట్‌కు వచ్చిన వారి వివరాలతోపాటు ఆధార్ కార్డును పరిశీలించాలని, ఇంటికి వచ్చి వెళ్తున్న వారి వివరాలు తెలుసుకొని పంపించాలన్నారు. ఇంట్లో విలువైన బంగారు నగలు, నగదు ఉంచరాదని, బ్యాంక్‌లో భద్రపరచడమే మేలని సూచించారు. ఊళ్లు వెళ్లేటప్పుడు ఇంటికి తాళాలు జాగ్రత్తగా వేసుకుని పక్కన ఉన్న వారికి, పోలీస్‌లకు తెలియపరచాలన్నారు. సీసీ కెమెరాలు వంద మంది పోలీసులతో సమానమని, వాటి ఏర్పాటు చేయడం వల్ల ఇంటికి రక్షణగా ఉంటాయని చెప్పారు. చోరీలు జరిగినప్పుడు పోలీసులకు సహకరించాలని స్థానికులను డీసీపీ వెంకటరత్నం కోరారు. కార్యక్రమంలో ఏసీపీ వెంకటరావు, సీఐ శ్రీనివాసరావు, స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అపార్ట్‌మెంట్ వాసులకు అవగాహన కల్పిస్తున్న క్రైం డీసీపీ వెంకటరత్నం

భైరవ స్వామికి విశేష పూజలు

సింహాచలం: అమావాస్య పురస్కరించుకుని భైరవ వాకలోని భైరవస్వామి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి సాయంత్రం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భైరవుడిని దర్శించుకున్నారు. అమృతకలశాలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. అర్చకులు స్వామికి పంచామృతాభిషేకాలు, విభూదితో అభిషేకం నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. ఆలయానికి వెళ్లే రెండు కిలోమీటర్ల దారి భక్తజన సంద్రంగా మారింది.

హలీం సెంటర్ ప్రారంభం

డాబాగార్డెన్స్: జగదాంబ జంక్షన్ దండుబజార్ రోడ్డులో ఏర్పాటు చేసిన దిల్ సే హైదరాబాద్ హలీం సెంటర్‌ను ఆదివారం వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. హలీం సెంటర్ నిర్వాహకుడు షేక్ జుబేర్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో కుల మతాలకతీతంగా హలీం సెంటర్ ఏర్పాటు చేసి నామమాత్రపు ధరలకే మటన్, చికెన్ హలీం అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ, 42వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్, పార్టీ నాయకుడు కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



హలీం సెంటర్‌ను ప్రారంభిస్తున్న కె.కె.రాజు, జియ్యాని శ్రీధర్

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

ఆనందపురం : మండలంలోని గంభీరం పంచాయతీ పరిధిలోని బొడ్డపాలెంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రబోధ సేవా సమితి సభ్యులు ప్రచారం నిర్వహించారు. విజయరాంపురం ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు మాట్లాడుతూ శివలింగంపై ఉన్న మూడు విభూతి రేఖలు, జీవాత్మ, ఆత్మ, పరమాత్మలకు గుర్తులని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు వి.సురేష్, ఎస్.శ్రీనివాస్, కె.సంతోష్, కె.బంగారుతల్లి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంకల్పానికి తలవంచక తప్పదు

కూర్మన్నపాలెం : ప్రజల సంకల్పం బలంగా ఉన్నంత కాలం పోరాటాల పురిటి గడ్డ అయిన విశాఖ ఉక్కు పట్ల కేంద్ర ప్రభుత్వం ఎన్ని ఎత్తుగడలు వేసిన ప్రజా ఉద్యమాల ముందు తలవంచక తప్ప దని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఈ మేరకు 1,123వ రోజు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, హెచ్ యం యస్ యూనియన్ నాయకులు పాల్గొని దీక్షకు సంఘీభావం తెలుపుతూ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా పోరాట నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధ్వంసకర ప్రయత్నాలకు అండగా ఉంటూ వాటిని అమలు జరిపే అధికారులుకు తగిన గుణపాఠం నేర్పుతామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు తహతహలాడుతోందని, విశాఖ ఉక్కు జోలికి వస్తే కాంట్రాక్ట్ కార్మికులు, నిర్వాసితులు, ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. విశాఖ ఉక్కును కొనడానికి ఎవరు ముందుకు వచ్చిన అడ్డుకుంటామని, పోరాటాలు, ప్రాణ త్యాగాల ద్వారా ఏర్పడిన సంస్థను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేట్‌పరం కానివ్వమన్నారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, హెచ్.యం.యస్ యూనియన్ ప్రతినిధులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.